స్కెచ్

# కాకిపిల్లకు జోలపాట

"శశికాంత్"

"జోజో హాయీ వెన్నెల రేయీ,
నా చిన్నితల్లి కన్ను మూయీ"

కాకమ్మ కంఠం సవరించుకొని నవీనపద్ధతిలో పాట పాడటం మొదలు పెట్టింది. కాని, కాకిపిల్ల కన్నుమూయటం మానేసి లేచి మూల్గటం మొదలు పెట్టింది. పక్కలో అణచిపెట్టి తల్లి కాకి బిగ్గరగా జోలపాడింది.

ఊహుం! చిట్టికాకి యేడుపు లంకించుకొంది. కాకమ్మ కాసేపు యెత్తుకొని జోలపాడింది. ఎన్ని తంటాలు పడినా పిల్ల నిద్రపోవటంలేదు. విసుగెత్తిన కాకమ్మ నసుగుతూ చెంపకొకటి అంటించింది. ఇంకేముంది, శ్రుతి హెచ్చిపోయింది. పాపం కాకమ్మకూడా జాలివేసి "నా చిట్టితల్లి! ఏడవకమ్మా! నా చేతులు విరిగిపోను, ఎంత గట్టిగా కొట్టానమ్మా" అని నొచ్చుకుంది.

ఏడ్చి, ఏడ్చి పోవరకు చిట్టికాకి అలసి నిద్ర పోయింది. కాని కాకమ్మ బుర్రలోకి-అంత అర్థ రాత్రిలో ఆలోచనలు రాసాగాయ్.

గోడమీద కూర్చొని, ప్రొద్దున 'కా, కా' అని అరిచింది. 'కే, కే' అని యెవరో యెక్కిరించారు. కళ్ళెర్ర చేసింది. ఒక్కసారి దాన్ని పట్టుకొని, గట్టిగా ముక్కు నేలకేసి రాయాలనిపించింది. "ఆ వెధవ కోకిలమ్మ. ఎప్పుడూ యింతే. దీని సంగతేదో యివాళ్ళ తేల్చిపారెయ్యాలి" అనుకొంది. రివ్వున అక్కడనుంచి లేచి కోకిలవున్న చెట్టువైపు పరుగెత్తింది. నెత్తిమీద బిత్తరపోయేటట్లు తన్నాలను కొన్న కాకమ్మ, తన సభ్యతకు భంగం వస్తుందనేమో, యెదురుగా కొమ్మమీద వాలి, కోకిలకేసి కొరకొర చూసింది. కోకిలమ్మ కొంచెం బెదిరినా పైకి బింకంగా కూర్చొనివుంది. కాకమ్మ తిరిగి 'కా కా' అని అరిచింది. కోకిల లోపల భయంతోనే మెల్లిగా యెక్కిరిస్తూ 'కేకే' అంది.

విసురుగానే ఎగిరి మీదకు వురికింది కాకమ్మ. కాని కొట్టకుండానే "యేం, నీకంటె అందంగా లేనా, కమ్మగా కూయలేనా, తెగ యెక్కిరిస్తూన్నావ్" అంది, దగ్గిరిగా వెళ్ళి ఆగిపోయి.

"ఓ; నీ కంటె యెన్నో రెట్లు కమ్మగా కూయగలను. ఏదీ, నా మాదిరి కూయి చూద్దాం"అంటూ 'కుహూ, కుహూ' అని కూసింది కోకిల.

కాకమ్మ దాన్ని అనుసరిస్తూ 'కిహీకిహీ'అంది. కోకిలమ్మ కిలకిలనవ్వి చప్పట్లు చరిచింది. కాకమ్మకు యెక్కడలేని వుక్రోషం వచ్చింది.

"ఏం, నీ కంటె కమ్మగా లేదా నా కంఠం చూడు!"అని బిగ్గరగా అరిచింది కసిదీరా. కోకిలమ్మ ఆ శబ్దానికి వోర్చుకోలేక చెవులు మూసికొంది. కాసేపటికి అలసిపోయిన కాకమ్మ "ఈ మానవుల కూడా బుద్ధిలేదులే. ఎప్పుడూ వాళ్ళ యింటి గోడమీద కోరకుండానే కూస్తున్నానని కదూ నాకు 'కాకిగోల' బిరుదిచ్చి నీ కంఠస్వరం వినని వాళ్ళుకూడా నీకు 'కోకిలకంఠం' బిరుదు ఇచ్చారు. నీ మాదిరే నేను కూడా కోరినా కూయకుండా వుంటే 'కాకమ్మ కంఠం' అని బిరుదిచ్చి వుండే వాళ్ళు, కమ్మదనానికి" అన్నది.

కోకిల కొంచెం ధైర్యంగా నవ్వింది, కాకమ్మ అమాయికత్వానికి. "అంతే. ఇకమీద నువ్వు కూడా నోరుమూసుకొని కూర్చో. వస్తా" అంటూ 'కేకే' అని యెక్కిరిస్తూ గాలిలోకి ఎగిరింది. కాకమ్మ రివ్వున దాన్ని వెంటాడుతూ "యెన్ని సార్లు చెప్పాను మళ్ళీ అలా కూయవద్దని"— "తూ్వ" అని వూస్తూ "నీ బ్రతుకూడా పెద్ద లెక్కలోకి చెప్పొచ్చావ్. గుడ్లు పెట్టటమేగాని పిల్లల్ని చెయ్యటం తెలుసా, పెంచట మెరుగుదువా? ఎటొచ్చీ మళ్ళీ మా అండజేరి, దొంగతనంగా మా గూటిలో నీ గుడ్లు పెట్టి పోవాల్సిందేగా. నువ్వుమాత్రం చిన్నప్పుడు మేము పాడే జోలలకు నిద్రపోలేదా. తరువాత గుడ్లు నెత్తికొచ్చి, మమ్మల్నే యెక్కిరిస్తున్నావ్, పెంచి పెద్దచేశామన్న విశ్వాసం కూడా లేకుండా!"

కాకమ్మ బాగా ఆడిపోసుకుంది, అనవసర ప్రస్తావనైనా. కోకిలను వెంటాడటం చేతగాక ఆయాసంతో ఆగిపోయి చెట్టుపై వాలింది.

గూటిలో వున్న కాకమ్మకు యేదో చటుక్కున సంకోచం కలిగింది, నిజంగా తన కంఠం కమ్మగా వుండదా? అందుకే అయివుంటుంది, అమ్మాయికి నిద్రపట్టింది. కొంపదీసి కోకిలపిల్ల కాదు గదా? ఒళ్లంతా తడిమి చూచుకొని కాదని నిశ్చయించుకొంది.

మరి చిట్టితల్లి నా జోలపాటంటేనే నిద్రపోవటం మానేసిందే; మరి రెండు రోజులనుంచి. తన జోలపాట దానికి కమ్మగా లేదేమో! అందుకే లోకం కూడా 'కాగిగోల' అని గేలిచేస్తుంది.

ఇన్ని తరాలనుండి కాకమ్మల గొంతులు కమ్మగా లేనిది చిట్టిపిల్లలంతా యెలా నిద్రపోయారు? తన గొంతు కమ్మగా లేదన్న వాదాన్ని నమ్మలేకపోయింది. ఎంత తరచి చూచుకొన్నా ఆ మాటమీద నమ్మకం కలుగలేదు.

కన్నుమూసి కాసింత కునుకుతీసేలోగా భళ్లున తెల్లవారింది. 'కాకా' అంటూ కాకులు చేసే గోలకు వులిక్కిపడి లేచి "అబ్బ కాకిగోల" అని విసుక్కొంది. తనూ లేచి, రెక్కలు విదిల్చి 'కాకా' అని అరిచింది బిగ్గరగా. మనస్సు చివుక్కుమంది తన కంఠం కమ్మగాలే దనిపించి. అందుకే చిట్టమ్మ నిద్రపోవటం లేదన్న నిశ్చయానికొచ్చింది. "మరి, రోజూ జోలపాడట మెలా అమ్మాయికి? కోకిలమ్మ వచ్చి పాడుతుందా, ఈ కాకుల కూటంలో!" భారమైన సమస్యతో లోకంలోకి యెగిరిపోయింది.

పొద్దు బాగా యెక్కింది. తిరిగితిరిగి ఓ ఇంటిపై వాలింది కాకమ్మ. ఆ ఇంట్లోనుంచి జోలపాట వినవస్తోంది. కాని, పిల్లవాడు ఒక్కసారి అల్లరిగా యేడవడం సాగించాడు. ఆ యిల్లాలు భర్తగారితో, "చూడండీ వీడి హఠం! పాలు కుడిపి జోల పాడుతుంటే నిద్రపోవటం లేదు!" అన్నది.

భర్తగారు నవ్వుమొహంతో "నాకే వచ్చే నిద్రపోయింది, వులిక్కిపడి. వాడేం నిద్రపోతాడు!" అన్నాడు.

ఆమె కసురుకుంటూ "ఏమంటున్నారూ? నా జోలపాటకు వులిక్కిపడ్డారా? నా గొంతు మీలాగా కోకిల కంఠం కాకపోవచ్చులెండి" అని యెత్తిపొడిచింది.

"అదికాదే వెర్రిమొగమా! మన అబ్బాయి కూడా మొన్న ఆ సినిమాకు వెళ్ళినప్పుడు, ఆ పాటలు వినివుంటాడు. అందుకే నీ కంఠం వాడికి సరిపడలేదు."

కాకమ్మ యెంతో ఆప్యాయంగా వింటోంది, గోడమీద నిక్కినిక్కి చూస్తూ.

కొంచెముసేపు యేమీ వినపడకపోయేసరికి వెళ్ళి వాకిట్లో వాలింది.

"చిట్టితల్లి నవ్వవే, చిన్నారి పాపవే" కమ్మని పాట వినవస్తోంది. గ్రామఫోను యెదురుగ్గా కూర్చొని ఆయనగారు తాళంవేస్తూ కళ్లు తేలవేస్తున్నాడు ఆనందంతో. ఏడ్చే పిల్లాడు కాస్తా యేడ్పు మానేసి రికార్డు చివరికొచ్చేలోగా నిద్రపోయాడు. భర్తగారు విజయగర్వంతో భార్య ముఖంలోకి చూశాడు. ఆమె చిన్నబుచ్చుకొంది.

కాకమ్మ బుర్రలో కూడా చక్కని ఆలోచన కదిలింది. "కోకిల పాడిన జోలపాట రికార్డు తెప్పించేసుకొంటే సరి!" కాని గ్రామఫోనుసెట్టంతా యెక్కడ కొనుక్కొంటుంది? పాపం, క్షణంలో నిరాశపడ్డది.

ఉపాయం తెలిసినా అపాయం దాటలేని వేదనతో గూడు చేరుకొంది. పిల్లకాకికేం తెలుసు— కేకలెయ్యటం మొదలుపెట్టింది ఆకలితో. విసుగొచ్చి మొత్త బుద్ధయింది. కాని కన్నతల్లి యెన్నడూ అలా చెయ్యలేదేమో! దగ్గరగా తీసుకొని "నీకు జోలపాట వినిపించి నిద్రపుచ్చేదెలాగమ్మా" అంది బాధగా.

మెరుపుతీగెలాంటి ఆలోచనతో కాకమ్మ ముఖమంతా కాంతివంతమైంది. "ఏం చక్కని యోచన, ఆ యింటి పెరట్లోని చెట్టుపై కాపురం పెట్టేస్తే సరి." తన తెలివితేటలిని తనే అభినందించుకొంది. "కాని, యీ పసికందును యెలా యెత్తుకుపోవటం?"

ప్రాణం విసుగెత్తింది. మరో ఆలోచన దొరకలేదు. చివరకు "ఈసారి కాన్పుకయినా తెలివిగా— జోలపాట రికార్డు లున్న యింటికి దగ్గర్లో గూడు కట్టుకోవాలి" అని తీర్మానించుకొంది. ★